క్లుప్తంగా

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : సంక్రాంతి సందర్భంగా చిన్నారులు, మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం అభినందనీయమని భీమవరం ట్రాఫిక్ ఎస్సై మోహనరావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని 18వ వార్డు పేరంటాల చెరువు గట్టు వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆకృతి లేడీస్ షాపింగ్‌మాల్, అరసవల్లి ఈశ్వరమ్మ - వీరవెంకటాచార్యులు ఛారిటబుల్ ట్రస్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞానవేదిక కో-కన్వీనర్ అల్లు శ్రీనివాస్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఇందుకూరి శివాజీ వర్మ, మలిశెట్టి సాయిబాబా, అరసవల్లి మణికంఠ వెంకటేష్, యర్రంశెట్టి గౌతమి, భోగిరెడ్డి సత్య, అమనాపు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు దుంపగడపలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆకివీడు : దుంపగడప గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్ మంగళవారం చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మితో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



యండగండిలో అమ్మవారి ఊరేగింపు

ఉండి : యండగండిలోని పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, గరగనృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి తోడ్కొనివెళ్లారు. ఈ సందర్భంగా ఇంటింటా నైవేద్యాలు పెట్టి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి స్వాగతం పలికారు. గ్రామంలో ప్రధాన రహదారుల్లో నిర్వహించిన ఊరేగింపులో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొని జాతర కార్యక్రమాన్ని పరిశీలించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాత సుందరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఉద్యోగి వెంకటేష్

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. భీమవరానికి చెందిన ఎం.సుందరరావు అమ్మా సిల్క్స్ పేరున ఈ మొత్తాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. కార్యాలయ గుమస్తా వెంకటేష్ దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. దాత వెంట మావూరి రాజా, మావూరి ప్రసాద్, పాపోలు ఏడుకొండలు తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



లక్కీ డ్రాలో విజేతల వివరాలను ప్రకటిస్తున్న డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ బస్సులను ప్రయాణీకులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి, డాక్టర్ కంచర్ల నరసింహారావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో లలిత ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన లక్కీ గిఫ్ట్ స్కీం డ్రాను తీసి మంగళవారం విజేతలను ప్రకటించారు. తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రికి, తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపునకు ప్రయాణించే రహదారులలో బస్సులకు సంబంధించి ఈ లక్కీ డ్రా ను అమలు చేస్తున్నారు. రెండు ప్రాంతాల వైపు మొదటి మూడు బహుమతులను ప్రయాణీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్‌వైజర్స్, ప్రయాణీకులు పాల్గొన్నారు.

కుముదవల్లిలో డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ఆర్డీవో దాసిరాజు, అధికార సిబ్బంది

పాలకోడేరు : కుముదవల్లి గ్రామంలో ప్రప్రథమంగా డ్రోన్ సర్వే మొదలైంది. భూముల రీ సర్వే లో భాగంగా మంగళవారం నాడు కుముదవల్లి గ్రామం నుంచి డ్రోన్ సర్వేను ఆర్డీఓ దాసి రాజు ప్రారంభించారు. గ్రామంలో మొత్తం 1,100.51 ఎకరాల భూమి ఉండగా, సోమవారం మొత్తం భూమిని ప్రింట్లు తీసింది. మూడు నెలల సమయంలో ఈ ప్రింట్లు ఆధారంగా సర్వే సిబ్బంది సర్వే నిర్వహిస్తారు. ఆర్ఐ నాగభూషణం మాట్లాడుతూ 1932 సర్వే ప్రకారం ప్రస్తుతం భూములున్నాయని, చాలా చోట్ల భూముల హెచ్చు తగ్గులు ఉన్నాయని, దీని ప్రకారం మొదట కుముదవల్లి గ్రామాన్ని ఎంచుకున్నామని చెప్పారు. దానికి సరిహద్దు పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, కోరుకొల్లు, మైప గ్రామాలను డ్రోన్ సర్వేకు ఎంపిక చేశామని, ఇక్కడ తీసిన ప్రింట్లు విజయవాడ నుంచి వస్తాయని, తేడాలున్న భూముల యజమానులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో పరిష్కారం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు, తహసీల్దార్ షేక్ హుస్సేన్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూహక్కుతో భూమి సురక్షితం



గ్రామ సరిహద్దులు గుర్తిస్తున్న సర్వే ఆఫ్ ఇండియా బృందంతో సర్పంచ్ సాంబశివరావు

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు భూరక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరి భూమి సురక్షితంగా ఉంటుందని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు అన్నారు. మంగళవారం చెరుకువాడలో సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్ టీమ్ కే భాస్కరరావు తదితర ప్రతినిధుల బృందం చెరుకువాడ, పెదపుల్లేరు గ్రామాల్లో పర్యటించి జీపీఎస్ ద్వారా సరిహద్దులు గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే పనులను సర్పంచ్ సాంబశివరావు పర్యవేక్షించి మాట్లాడారు. భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే రీసర్వే ద్వారా ఎన్నో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నమణి, గ్రామ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్ చిన్నారావు, అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా బైపాస్ రోడ్డు



అధ్వానంగా ఉన్న స్థానిక బైపాస్ రోడ్డు మార్జిన్

ఆకివీడు : స్థానిక బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. వెంకయ్య వయ్యేరు పంట కాల్వకు చేర్చి బైపాస్ రోడ్డు ఉండడంతో కాలువగట్టు ప్రాంతం వ్యర్థాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో కొంత మంది బహిరంగ మల,మూత్రవిసర్జనలకు పాల్పడుతుండడం, కోళ్ల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు కాలవ గట్టుపై పారవేయడంతో పంటకాల్వ కలుషితమవుతోంది. బైపాస్ రోడ్డు వెంబడి దుర్వాసన వెదజల్లుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. బైపాస్‌రోడ్డులో ఉన్న పిచ్చిమొక్కల్ని తొలగించి, ఆ ప్రాంతాన్ని గార్డెన్‌గా అభివృద్ధి చేయాలని, మెస్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వ్యర్థాలు, బహిరంగ మలవిసర్జన చేసేవారిపై నగర పంచాయతీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

19న మార్టేరులో వేమన జయంత్యుత్సవాలు

పెనుమంట్ర: విశ్వకవి మహాయోగి వేమన జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పెనుమంట్ర మండలం మార్టేరులో జిల్లాస్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు ద్వారపూడి వేణుగోపాలకృష్ణారెడ్డి, మార్టేరు ఎంపీటీసీ గుడిమెట్ల లక్ష్మణరెడ్డి మంగళవారం తెలిపారు. 19వ తేదీ ఉదయం మార్టేరులోని వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో విద్యార్థినీ, విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో వేమనపై పద్య, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 9492222228, 8499857333, 7780484313 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 19వ తేదీ ఉదయం 9గంటల నుంచి వేణుగోపాల స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. 7,8 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 9,10 తరగతి విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణించి పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



తిరుపతమ్మ నాటకంలో ఓ సన్నివేశం

భీమవరం (ప్రకాశం చౌక్) : శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59వ వార్షికోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు పోలవరపు హారిక వైజాగ్ వారి ప్రదర్శించిన భరత నాట్యం, అలాగే శ్రీసాయి ఘంటసాల సినీ ఆర్కెస్ట్రా భీమవరం వారి సినీ మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు శ్రీ విజయలక్ష్మీ, శ్రీనివాస నాట్యమండలి తెనాలి వారు ప్రదర్శించిన శ్రీ తిరుపతమ్మ మహత్యం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి కళా ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు కూచిపూడి భరత నాట్యం, 6 గంటలకు మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు శ్రీ షిర్డిసాయిబాబా మహాత్యం నాటకం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా జ్యోతిబసు వర్ధంతి



భీమవరంలో జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : కమ్యూనిస్టు పార్టీనేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు వర్ధంతిని మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. జ్యోతిబసు చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబసు విద్యార్థి దశనుంచే స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములై జైలుకెళ్లి దేశ రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్రాల హక్కుల్ని కాపాడడంలో జ్యోతిబసు తీసుకున్న చర్యలు అమోఘమన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కుల్ని హరిస్తోందని విమర్శించారు. బీజేపీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని బలరామ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, లత, జక్కంశెట్టి సత్యనారాయణ, మల్లిపూడి ఆంజనేయులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహ మహోత్సవాలు



సీతారాంపురంలో పూజలు అందుకున్న సీతారాములు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురం నార్త్ పంచాయతీలోని పట్టాభిరామాలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవాలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. గ్రామానికి చెందిన చినమిల్లి వెంకటేశ్వరరావు, లావణ్య దంపతులు, వేగిరౌతు ఆది గణేష్, సీలిమ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పవళింపు సేవలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు, హరికథలు, నాదస్వరం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారత్ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

మొగల్తూరు: మండలంలోని గ్యాస్ వినియోగదారులకు అందుబాటులో సుప్రీం భారత్ గ్యాస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పాస్టర్ ఈద దైవాశీర్వాదం అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన సుప్రీం గ్యాస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇప్పటి వరకు భారత్ గ్యాస్ వినియోగదారులు నరసాపురం నుంచి సేవలు పొందేవారని ఇకపై మొగల్తూరులో సుప్రీం భారత్ కార్యాలయం నుంచి సేవలు పొందవచ్చని సంస్థ అధినేత సరాకుల రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎన్నాబత్తుల ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల మోహన్‌రావు, కొల్లాబత్తుల రాంపండు, ఎం కిరణ్‌కుమార్, చవ్వాకుల మధు, విలియమ్, వేదాల ఆనంద్, సరాకుల యోనా పాల్గొన్నారు.

బీసీ మహాసభ కన్వీనర్ల నియామకం

పెనుగొండ: జాతీయ బీసీ మహాసభ ఆచంట విభాగం కన్వీనర్లను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అల్లా సూర్యభాస్కరరావు తెలిపారు. ఆచంట వేమవరం కర్ల భవ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. మండల కన్వీనరుగా ఆచంట వేమవరానికి చెందిన తాళ్ల కుమార స్వామి, యువజన కన్వీనర్‌గా ముప్పన సుబ్రహ్మణ్యంలను నియమించారు. వీరికి నియామక పత్రాలు అందించారు. సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో కృషి చేయడమే జాతీయ బీసీ మహాసభ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పేకాటశిబిరంపై దాడి

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో పేకాటఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. వీరి నుంచి రూ.36,240 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కుటుంబ సభ్యులతో సంక్రాంతి



పండగ సందర్భంగా ఒక్కచోట చేరి సందడి చేసిన గన్నాబత్తులవారి కుటుంబ సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా భీమవరం గన్నాబత్తుల సరోజనమ్మ కల్యాణ మండపంలో ప్రాచీన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ - స్ఫూర్తి పేరిట నిర్వహిస్తున్న వేడుకలు శనివారం ముగిశాయి. మండపంలో ఐదు తరాల గన్నాబత్తులవారి కుటుంబీకులతో ఈ వేడుకలు కోలాహలంగా సాగాయి. దేశ విదేశాలలో స్థిరపడ్డ గన్నాబత్తులవారి ఐదు తరాల కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనుమలు, ముని మనుమలంతా ఒక్కచోట చేరి ప్రాచీన సంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు తెలియపర్చారు. ఈ సందర్భంగా 2వ తరం నుంచి ప్రముఖ న్యాయవాది, నర్సాపురం వై.యస్ కళాశాల పాలకవర్గ మాజీ సభ్యుడు, మాజీ ఉపాధ్యక్షుడు గన్నాబత్తుల వెంకట రామారావును పాదపూజలతో సత్కరించి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం 50 ఏండ్లుగా గన్నాబత్తులవారి కుటుంబంతో అనుబంధం ఉన్న సంఘ సేవకులు చెరుకువాడ సోదరులు వెంకట్రామయ్య, రంగసాయిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గన్నాబత్తుల సత్యనారాయణరావు, చిన నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, కుమార్, చెన్నంశెట్టి గౌరీనాధరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బొమ్మల కొలువు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

పోడూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో జిన్నూరు గ్రామానికి చెందిన పురోహితులు నుదురుపాటి రాంబాబుశాస్త్రి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆహుతులను ఎంతో ఆకర్షించింది. గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితులు నుదురుపాటి సతప్ప స్ఫూర్తితో ఆయన కుమారుడు రాంబాబు శాస్త్రి 27 ఏళ్లుగా ఏటా సంక్రాంతి సంబరాల్లో భాగంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. కొండపల్లి, విశాఖపట్నం, కోయంబత్తూరు తదితర ప్రాంతాల నుంచి ఆయన బొమ్మలు సేకరిస్తుంటారు. రాంబాబుశాస్త్రి మంగళవారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పౌరాణిక సన్నివేశాలు, సంక్రాంతి, ఉగాది, దీపావళి వంటి పండుగ సన్నివేశాలు, వివిధ చేతివృత్తుల వారు, వివిధ పంటలు, వ్యవసాయం చేసే రైతులు, సైనికులు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు ఇలా అనేక రకాల వృత్తులకు సంబంధించిన బొమ్మలను ఏర్పాటు చేశారు.

రామాలయంలో బొమ్మల కొలువు

పాలకొల్లు సెంట్రల్: సంక్రాంతి సందర్భంగా స్థానిక బుధవారపు వీధి రామాలయంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి మహిళలు ఆలయంలో వివిధ రకాల బొమ్మలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును ఆసక్తిగా తిలకించారు. అనంతరం లలిత పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, సునీత, సీతామహాలక్ష్మి, లీలాకుమారి, శాంతకుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జుత్తిగలో ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు

పెనుమంట్ర: ధనుర్మాసం ముగింపు సందర్భంగా నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు, ఉమా వాసుకీ రవి సోమేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు అర్చన, విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామ వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు నల్లమిల్లి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత పల్లకీ సేవ నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా యువత సంప్రదాయ దుస్తులు ధరించి అర్చన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం పల్లకీని భుజాలపై ఎత్తుకుని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమనపూడి వీర్రెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణలో పోలీసులే కీలకం

పెనుగొండ: సమాజంలో ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, వారిని గౌరవించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ నూలి తాతాజీ అన్నారు. దివంగత నూలి శ్రీవాస్తవ్ జ్ఞాపకార్థం తండ్రి నూలి వెంకట సత్య కోటేశ్వర గుప్త (తాతాజీ) పెనుగొండ పోలీసులకు యూనిఫాంలు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మేడపాటి చిరంజీవిరెడ్డి, పిల్లి సత్తిరాజు, లక్ష్మీ లాలిత్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఈడూరులో అగ్నిప్రమాద బాధితులకు వంట సామాగ్రిని అందజేస్తున్న ఎస్సీసెల్ నాయకులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బింకం నరశింహారావు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు ఆధ్వర్యంలో వంట సామాగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులను ఎస్సీనాయకులు మంగళవారం అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ బుడితి సుజన్ కుమార్, మండల ఎస్సీసెల్ నాయకులు సబ్బితి రాజేష్, ఖండవల్లి రవికుమార్, తేలి సుందరరావు, ఇల్లూరి సంపతరావు, పొన్నమళ్ల సంపతరావు, యాళ్ల హోనోక్‌కుమార్, బింకం యోహాన్, తులసే బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గాల అభివృద్ధి జగనన్నకే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ సామాజిక వర్గానికి రికార్డు స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. మంగళవారం తాతాజీ తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్‌పై కేంద్రం గణాంకాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలబడడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పాలనకు నిదర్శనమన్నారు. దేశంలోని 22 రాష్ట్రాల్లో ఎస్సీ సామాజిక వర్గాల్లో 29.84 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 29.10 లక్షల కుటుంబాలకు సబ్‌ప్లాన్‌తో లబ్ధి చేకూరిందన్నారు. 6.15 లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లో ఈడబ్ల్యూఎస్, ఎల్‌ఐజీ ద్వారా పట్టణ ప్రాంతాల్లో 3.29 లక్షల గృహాలను నిర్మించగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1.38 లక్షల ఇళ్ల నిర్మాణంతో అగ్రస్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెపుతున్నాయన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారంటూ కొందరు ప్రతిపక్ష నేతలు కోర్టులకు వెళ్లారని కనీసం నివేదికలు చూసైనా ఆ నాయకులకు కనువిప్పు కలగాలని కోరుకుంటున్నానన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధితోనే సమాధానం చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌పార్టీ నాయకులు గంటా నరేష్, పాలపర్తి కృపానాథ్, తెన్నేటి సామ్యూల్, బెజ్జవరపు నాగరాజు, పెచ్చెట్టి కృష్ణాజి, తలుపూరి భుజంగరావు, పిల్లా అప్పాజి, తాడి శ్రీనివాసు పాల్గొన్నారు.